రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త





పిడుగుపాటుకు మృతి చెందిన ఎద్దు



నీటిలో తేలుతున్న వరి పనలు

# అంతులేని శోకం



ఈర్లపల్లిలో వేళ్ళతోపాటు కూలిన భారీ వృక్షం



వడగండ్లను చూపిస్తున్న రైతు శోభన్

ఈర్లపల్లిలో దెబ్బతిన్న వరి పంటను వ్యవసాయాధికారి లావణ్యకు చూపిస్తున్న రైతులు





తిరుమాలపూర్ గ్రామంలో నేలకొరిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



ఈర్లపల్లిలో నేలరాలిన మామిడి కాయలు

**చేతికొచ్చిన పంటలు అతలాకుతలం**
**పిడుగుల ధాటికి పటుచోట్ల మూగజీవాలు మృతి**
**నేలకొరిగిన భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు**
**దౌల్తాబాద్ మండలంలో విరుచుకుపడిన వడగండ్ల వాన**

**దౌల్తాబాద్, మే 20, ప్రభాతవార్త:** కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన పంట..మరికొద్ది రోజుల్లో చేతికి వస్తుందనుకున్న తరుణంలో ప్రకృతి కన్నెర్ర జేసింది. మంగళవారం వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండలంలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. చూస్తుండగానే ఆకాశం మేఘావృతమై, భీకరమైన ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వాన విరుచుకుపడింది. ఈ అకాల వర్షం సృష్టించిన ప్రళయానికి దౌల్తాబాద్ మండల ప్రజలు, ముఖ్యంగా రైతాంగం ఒక్కసారిగా కుదేలైంది. ప్రకృతి సృష్టించిన ఈ దారుణ విలయానికి రైతులు వేసిన పంటలు అతలాకుతలమయ్యాయి. గాలి వేగానికి భారీ వృక్షాలు సైతం వేళ్లతో సహా పెకలించుకొని నేలకూలాయి.

మండంలోని తిరుమాలపూర్ గ్రామంలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరగడంతో ఆ గ్రామంతో పాటు మరికొన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయి చీకట్లు అలుముకున్నాయి. జనజీవనం పూర్తిగా స్థంభించిపోయింది. ఈర్లపల్లి గ్రామంలో పేదలు, సామాన్యుల ఇండ్లపై ఉన్న రేకులు గాలి హోరుకు కాగితాల్లా ఎగిరిపోయి చాలా దూరంలో పడ్డాయి.

**మూగజీవాలు విలవిల**

ఇవన్నీ ఒకెత్తయితే, వర్షంతో పాటు పడిన పిడుగుల ధాటికి పటుచోట్ల మూగజీవాలు ప్రాణాలు కోల్పోవడం స్థానికులను తీవ్రంగా కలచివేచింది. మండలంలోని ఈర్లపల్లి గ్రామంలో రైతన్నల పరిస్థితి అయితే వర్ణనాతీతంగా మారింది. చేతికొచ్చిన వరి పంట, మామిడి తోటలు పూర్తిగా ధ్వంసమైపోయాయి. వడగండ్ల దెబ్బకు వరిచేలలో గింజలన్నీ రాలిపోయి, పచ్చని పొలాలన్నీ వడ్ల కల్లాలుగా మారిపోయాయి. కోసి ఆరబెట్టిన వడ్ల కుప్పలు కూడా వర్షపు నీటిలో నాని ముద్దయ్యాయి. ఈర్లపల్లిలో జి.విజయ్‌కుమార్ సుమారు 45 ఎకరాల మామిడి తోట పూర్తిగా ధ్వంసమై కాయలన్నీ నేలరాలాయి. ఏడాది పొడవునా రెక్కలు ముక్కలు చేసుకొని పండించిన పంట కళ్ల ముందే మట్టిపాలైందని, అప్పులు ఎలా తీర్చాలో.. కుటుంబాలను ఎలా పోషించాలో తెలియడం లేదంటూ రైతులు గుండె లబోదిబమంటున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి తగిన నష్టపరిహారం అందించి తమను ఆదుకోవాలని వారు వేడుకుంటున్నారు.

**493 ఎకరాల్లో వరికి నష్టం**

ఈ విపత్కర పరిస్థితుల నేపథ్యంలో.. బుధవారం మండల అగ్రికల్చర్ ఆఫీసర్ లావణ్య మండలంలోని ఈర్లపల్లి గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటించారు.

దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలించిన ఆమె ఈర్లపల్లి ఒక్క గ్రామంలోనే సుమారు 150 ఎకరాల వరి పంట పూర్తిగా నష్టపోయినట్లు గుర్తించారు.

అలాగే మండల వ్యాప్తంగా 11 గ్రామాల్లో క్షేత్ర స్థాయి పరిశీలన జరిపి, మొత్తం సుమారు 493 ఎకరాల వరిపంట దెబ్బతిన్నట్లు నష్టాన్ని అంచనా వేశారు. అధైర్యపడొద్దని, పంట నష్టానికి సంబంధించిన పూర్తి నివేదికను ప్రభుత్వానికి సమర్పించి, త్వరగా నష్టపరిహారం అదేలా చూస్తామని బాధిత రైతులకు ఆమె భరోసానిచ్చారు.

## పర్యావరణ విధ్వంసంపై ఉద్యమ స్ఫూర్తి

★ రచయితల సమ్మేళనంలో తీర్మానం ★ కడ్తాల్ వేదికగా ది ఎర్త్ సెంటర్‌లో మేధోమథనం ★ కవుల కలాలే ప్రకృతి విలువలను తెలియజేసే అస్త్రాలు ★ ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న



పర్యావరణ రచయితల సమ్మేళనంలో పాల్గొన్న కవులు

**కడ్తాల్, మే 20, ప్రభాతవార్త :** కడ్తాల్ మండలం అన్మాస్‌పల్లిలోని ది ఎర్త్ సెంటర్‌లో అద్భుతమైన సామాజిక చైతన్య ఘట్టానికి తెరలేచింది. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల పర్యావరణ రచయితల సమ్మేళనం బుధవారం ఆలోచనాత్మక సందేశాలతో ప్రారంభమైంది. రోజురోజుకూ పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలు, అడవుల నరికివేత, క్షీణిస్తున్న నీటి వనరులు, మానవ ఆరోగ్యంపై పడుతున్న దుష్ప్రభావాల గురించి పలువురు కవులు, రచయితలు, కళాకారులు తమదైన కోణంలో ఆవిష్కరించారు. పర్యావరణాన్ని కేవలం ఒక అంశంగా కాకుండా, ఉద్యమంగా మార్చాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆధునిక వాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న తన సహజసిద్ధమైన శైలిలో సభికులను మంత్రముగ్ధుల్ని చేశారు. "భారతీయ సంస్కృతి అంటేనే ప్రకృతిని ఆరాధించే గొప్ప సంప్రదాయం. కానీ, నేటి ఆధునిక జీవన విధానంలో మనిషి రోజురోజుకూ ప్రకృతికి దూరమైపోతున్నాడు. ఇది అత్యంత ఆవేదనాకరం. సమాజం సుస్థిర అభివృద్ధి వైపు నడవాలంటే.. పరిమితత్వం, ప్రశాంతత్వం, సహజత్వం అనే మూడు సూత్రాలను మనం జీవితంలో భాగం చేసుకోవాలి" అని వెంకన్న పిలుపునిచ్చారు. నేటి తరానికి ప్రకృతి విలువలను తెలియజేసే అస్త్రాలు కవులు, రచయితల కలాలేనని తమ పాటలు, రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం తేవాలని ఆయన కోరారు. సహజకవి జయరాజ్ కూడా ప్రకృతి విధ్వంసాన్ని అడ్డుకోవడానికి కళాకారులు ఉద్యమ స్ఫూర్తితో కలం పట్టాలని పిలుపునిచ్చారు. సమ్మేళనంలో కేవలం ప్రసంగాలే కాదు.. ప్రకృతి పరిరక్షణ కోసం ఏం చేయాలనే దానిపై మేధోమథనం సాగింది. ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ సాయి భాస్కర్ రెడ్డి సాంకేతికత, పర్యావరణ సమతుల్యతపై మాట్లాడారు. వందేమాతరం రవీందర్, సుస్థిర పుడమి పత్రిక సంపాదకులు రమేష్ రావు తమ ప్రసంగాల ద్వారా పర్యావరణ రక్షణలో పౌరుల బాధ్యతను గుర్తుచేశారు. శంషాబాద్ ఏసిపి నాగభూషణం శాంతిభద్రతలతో పాటు పర్యావరణ భద్రత కూడా సమాజానికి అంతే ముఖ్యమని పేర్కొన్నారు. కార్యక్రమ సమన్వయకర్త యానాల వెంకటరెడ్డి, డాక్టర్ జగన్, ఎస్కే లెనిన్ బాబు, డాక్టర్ ఉమామహేశ్వర్ రెడ్డి, సీజీఆర్ సంస్థ ప్రతినిధులు నాగేష్, రజనీకాంత్, శంకరయ్య, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

# కీసరగుట్టలో హెరిటేజ్ వాక్

**పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం**
**దాతల సహకారంతో కీసర క్షేత్రాభివృద్ధి**
**ఆలయంలో సౌకర్యాలకు ప్రతిపాదనలు పంపండి**
**కలెక్టర్ మను చౌదరి**



హెరిటేజ్ వాక్‌లో పాల్గొన్న కలెక్టర్

**కీసర, మే 20, ప్రభాతవార్త :** చరిత్రకు, ఆధ్యాత్మికతకు నిలయమైన ప్రాచీన శివక్షేత్రం కీసరగుట్టను మరింతగా అభివృద్ధి చేసి, ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో కీసరగుట్టలో బుధవారం హెరిటేజ్ వాక్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు కీసరగుట్ట కింది భాగంలోని నంది విగ్రహం వద్ద ప్రారంభమైన ఈ హెరిటేజ్ వాక్.. కోలాటాలు, సాంస్కృతిక ప్రదర్శనల నడుమ ఆలయ పైభాగం వరకు ఉత్సాహంగా సాగింది. ఈ నడకలో జిల్లా కలెక్టర్ మను చౌదరితో పాటు అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు, విద్యార్థులు కలిపి మొత్తం సుమారు 150 మంది పాల్గొన్నారు.

హెరిటేజ్ వాక్ అనంతరం కీసరగుట్ట ఆలయ కమిటీ ఛైర్మన్ తటాకం వెంకటేష్ శర్మ కలెక్టర్‌కు పూలమొక్క అందించి ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్న కలెక్టర్, అదనపు కలెక్టర్‌లకు ఆలయ పండితులు వేద మంత్రోచ్ఛరణలతో ఆశీర్వచనం అందించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

**మరింత బ్రహ్మాండంగా బ్రహ్మోత్సవాలు**

ఈ సందర్భంగా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం కీసరగుట్టలో జరిగే బ్రహ్మోత్సవాలకు దేశవ్యాప్తంగా ఎంతోమంది భక్తులు తరలివస్తుంటారని, వారికి మెరుగైన వసతులు కల్పించాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉందన్నారు. గతంతో పోలిస్తే ప్రతి బ్రహ్మోత్సవానికి ఆలయ వసతులలో ఒక కొత్త మార్పు, మెరుగుదల కనిపించాలని ఆకాంక్షించారు. దేశ, విదేశాల్లో కీసరగుట్టపై అపారమైన భక్తిశ్రద్ధలు గల దాతలు చాలా మంది ఉన్నారని పేర్కొన్నారు. ఇప్పటికే వారి విరాళాలతో ఎన్నో పనులు జరిగాయని... దాతల సహకారంతో మరిన్ని నిధులు సేకరించి ఆలయాన్ని ఇంకా అభివృద్ధి చేసామని హామీ ఇచ్చారు. పర్యాటక అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలను ఆలయ ఈవో సిద్ధం చేస్తే, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళానని పేర్కొన్నారు.

**కీసరగుట్ట సమగ్ర అభివృద్ధికి కృషి: అదనపు కలెక్టర్**

అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ.. కీసరగుట్ట ఎంతో విశిష్టమైన ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతమని కొనియాడారు. తాను ఇక్కడికి కొత్తగా బాధ్యతల్లోకి వచ్చిన తర్వాత ఎండోమెంట్ శాఖ ద్వారా ఈ క్షేత్ర ప్రాముఖ్యతను తెలుసుకున్నానని, కీసరగుట్ట సమగ్ర అభివృద్ధికి తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల మరియు పర్యాటక శాఖ అధికారిణి (ఇంచార్జ్) ఐ. విజయ కుమారి, ఎల్డీఎం శివప్రసాద్, జిల్లా ఉపాధి కల్పన అధికారి రాధిక, ఆలయ పురోహితులు, ఉపాధ్యాయులు, ఎంపీఓలు, స్పోర్ట్స్ బీపీటీలు, స్థానిక యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



బాధితులు, పేదలతో కలిసి మేడ్చల్ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆర్.కృష్ణయ్య

## రెవెన్యూ అవినీతిపై సిబిఐ విచారణకు డిమాండ్ చేస్తా

▸ఇరవై ఏళ్ల కిందట ఇళ్ల పట్టాలు ఇచ్చినా ఇంతవరకూ పొజిషన్ చూపరేం!
▸ఎంపి ఆర్.కృష్ణయ్య ఆందోళన

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 20, ప్రభాతవార్త :** గత ఇరవై ఏళ్ల కిందట ఇళ్ల పట్టాలు పొందిన పేదలకు ఇంతవరకు అధికారులు పొజిషన్ చూపలేదని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ఆందోళన వ్యక్తంచేశారు. బతుకు దెరువు కోసం వచ్చి జీవనం గడుపుతున్న పేదలు ఇంటి అద్దెలు చెల్లించలేక ఇబ్బందులకు గురవుతున్నారని.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు దక్కడం లేదని విమర్శించారు. ఘట్‌కేసర్ మండలం కాచవాని సింగారంలో 20 ఏళ్ల కిందట ఇచ్చిన పేదల ఇళ్ల పట్టాలకు పొజిషన్ చూకపోవటాన్ని నిరసిస్తూ బాధితులతో కలిసి ఆయన బుధవారం కలెక్టరేట్ ముట్టడించారు. అనంతరం జరిగిన ధర్నాలో మాట్లాడుతూ.. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి ఇళ్లపట్టాలు ఉన్న వారికి పొజిషన్ చూపటానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను వేలం వేయటానికి గానీ, అమ్మటానికి ప్రభుత్వానికి హక్కు లేదన్నారు. ఈ విషయంలో ప్రజలందరు తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు. కొందరు రెవెన్యూ అదికారులు రియల్ ఎస్టేట్ వారితో కుమ్మకై కోట్ల రూపాయల అక్రమ సంపాదనకు అలవాటు పడుతున్నారని ఆరోపించారు. నరేంద్రమోదీని కలిసి సిబిఐ విచారణకు డిమాండ్ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు జాతీయ బిసి విద్యార్థి సంఘం కన్వీనర్ పర్లగోర్ల మోదీరాందేవ్, భీంరాజ్, భాకీ రవి, అనంతయ్య, అజయ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పాలమూరుకు ప్రాణం పోస్తాం

**అందుకే ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలందరం సిఎంను కలిశాం**
**పెండింగ్ పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు**
**లక్ష్మీదేవి పల్లి ప్రాజెక్టుపైనా సానుకూలంగా స్పందించారు**
**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వెల్లడి**

**షాద్‌నగర్, మే 20, ప్రభాతవార్త :** పాలమూరు ప్రాజెక్టు విషయంలో బిఆర్ఎస్ కేవలం షో పుట ప్ చేసింది.. ఇంత పెద్ద ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు సంబంధించి కేటాయించిన నిధుల్లో సగం మాత్రమే ఖర్చు చేసింది.. ఆ సొమ్ము కూడా అవినీతిపాలైంది.. అందుకే లక్ష్మీదేవి పల్లి అలా మిగిలిపోయింది.. ఇప్పుడు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలమంతా పట్టుబట్టి సీఎంను కలిసాం.. ప్రాజెక్టు పనులను ఒకదారికి తీసుకొస్తున్నాం.. ప్రతిష్టాత్మక ఈ ప్రాజెక్టుకు ప్రాణం పోస్తాం.. లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ ను పూర్తి చేస్తాం.. అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్, పాలమూరు ప్రాజెక్టు విషయంలో ఉమ్మడి పాలమూరు జిల్లా ఎమ్మెల్యేలతో కలిసి సీఎంను కలిసిన ఆయన ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న పనులు, భూసేకరణ, నిధుల కేటాయింపు తదితర అంశాలపై చర్చించామన్నారు. తాను, పరిగి ఎమ్మెల్యేతో కలిసి లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ అవసరం గురించి సీఎం దృష్టికి తీసుకువెళ్లాలని తెలిపారు. ముఖ్యమంత్రి కూడా సానుకూలంగా స్పందించి పాలమూరు ప్రాజెక్టుకు సంబంధించిన పెండింగ్ పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారని తెలిపారు. అదేవిధంగా లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్‌కు కూడా ఆయన గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం సంతోషకరమని అన్నారు. రిజర్వాయర్ పూర్తయితే షాద్ నగర్ నియోజకవర్గంలో సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్



అధికారులు, రాజకీయ పక్షాల నేతలతో ఓటర్ల జాబితా రూపకల్పనపై సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ సి.నారాయణరెడ్డి

## బహుళ అంతస్తుల భవనాల్లోనే కొత్త పోలింగ్ కేంద్రాలు

**కలెక్టర్‌కు రాజకీయ పార్టీల విజ్ఞప్తి**

**రంగారెడ్డి అర్బన్, మే20, ప్రభాతవార్త:** పారదర్శక ఓటర్ల జాబితా రూపకల్పనే లక్ష్యంమని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. కలెక్టర్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో, ఎలాంటి తప్పులు లేని పారదర్శక ఓటర్ల జాబితా తయారీపై విస్తృతంగా చర్చ జరిగింది. ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం సందర్భంగా కలెక్టర్ చాంబర్‌లో జరిగిన ఈ సమావేశంలో ఓటర్ల నమోదు, జాబితా ప్రక్షాళన, బూత్ స్థాయి అధికారుల బాధ్యతలు, రాజకీయ పార్టీల భాగస్వామ్యం వంటి అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు.

**ఓటర్ల జాబితా పరిశీలనలో పార్టీల నేతలు భాగ్యస్వామ్యం కావాలి**

రాజకీయ పార్టీలు క్షేత్రస్థాయిలో పర్యటించి, ఓటర్ల జాబితా పరిశీలనలో భాగస్వాములు కావాలని సూచించారు. ప్రతి పార్టీ తక్షణమే బూత్ స్థాయి ఏజెంట్లను నియమించాలని కోరారు. జూన్ 15 నుంచి బూత్ స్థాయి అధికారులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి, ఇంటింటి సమగ్ర విచారణ చేపడతామని తెలిపారు. కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు, వలస వెళ్లిన వారిని గుర్తించడం, అర్హులైన కొత్త ఓటర్లను జాబితాలో చేర్చడం వంటి బాధ్యతలు బీఎల్ఓలపై ఉంటాయని స్పష్టం చేశారు. 2026 అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకునే యువతీ యువకులు తప్పనిసరిగా ఫామ్6 ద్వారా కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, తప్పుల సవరణల కోసం ఫామ్8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు పలు సూచనలు చేశారు. బహుళ అంతస్తుల భవనాల్లోనే కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, నకిలీ మరియు మరణించిన ఓటర్ల పేర్లను తొలగించాలని, బీఎల్ఓ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఒకే ఇంటి నంబర్‌పై అధిక సంఖ్యలో నమోదైన ఓటర్ల వివరాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఎస్ఐఆర్ 2002 ఓటర్ల జాబితా ప్రతులు అందజేయాలని, బీఎల్ఓలు, బీఎల్ఏలకు సమగ్ర శిక్షణ ఇవ్వాలని సూచించారు. రాజకీయ పార్టీల సూచనలను ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పరిశీలిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

నకిలీ, మరణించిన ఓటర్ల తొలగింపుతో పాటు అవసరమైన చోట కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వివరాలు, బీఎల్ఓలు, బీఎల్ఓ పర్యవేక్షకుల సమాచారం సంబంధిత అధికారుల నుంచి సేకరించి రాజకీయ పార్టీలకు అందజేస్తామని చెప్పారు.సమావేశంలో మర్రి శశిధర్ రెడ్డి, అంబోజీ శ్రీనివాస్, కొప్పుల నర్సింహా రెడ్డి, వానిపల్లి శ్రీనివాస్ రెడ్డి, తులసి ముఖేష్ ముదిరాజ్, సరికొండ దుర్గేష్, ఈ.ఆర్. యాదయ్య, వి. నవీన్ కుమార్, పి. ధర్మ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి శారద, ఆర్డీఓలు అనంత్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సరిత తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ భూములు పరిరక్షించాలి

**కలెక్టర్‌కు గ్రామస్తుల వినతి**

**మాడ్గుల, మే20, ప్రభాతవార్త :** మండలంలోని ఆర్కపల్లి గ్రామంలో శ్రీ ఆంజనేయస్వామి ఆలయానికి చెందిన భూముల విషయంలో భారీ అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ గ్రామస్తులు జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆలయ ఆస్తులను కాపాడాలని, అక్రమంగా జారీ చేసిన ఓఆర్ సి ని రద్దు చేసి దేవాదాయ భూములను తిరిగి ఆలయ ఆధీనంలోకి తీసుకురావాలని వారు కోరారు.గ్రామస్తుల వివరాల ప్రకారం గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 88, 241, 242, 283లలో మొత్తం సుమారు 33.20 గుంటల భూమి ఆంజనేయస్వామి దేవస్థానానికి చెందినదిగా పాత సెట్వార్ రికార్డులు, ఎండోమెంట్ శాఖ రిజిస్టర్లు మరియు ఇతర రెవెన్యూ పత్రాల్లో స్పష్టంగా నమోదై ఉందని తెలిపారు. అయితే కొంతమంది వ్యక్తులు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై అక్రమ మార్గాల్లో తమ పేర్లపై రికార్డులు నమోదు చేయించుకుని ఓఆర్సిని పొందినట్లు ఆరోపించారు. ఈ వ్యవహారంపై గతంలో తహసీల్దార్, ఆర్‌డిఓ స్థాయిల్లో విచారణలు జరిగినప్పటికీ పూర్తి స్థాయిలో న్యాయం జరగలేదని గ్రామస్తులు పేర్కొన్నారు. విచారణ సమయంలో ఆలయ భూములకు సంబంధించిన కీలక రికార్డులు, ఎండోమెంట్ శాఖ వివరాలు పరిగణనలోకి తీసుకోలేదని వారు ఆరోపించారు. మిగతా 2లో


డిఎంకు వినతి పత్రం అందజేస్తున్న స్థానికులు

## రద్దుచేసిన బస్సులను పునరుద్ధరించాలి

**పూడూరు, మే 20, ప్రభాతవార్త :** పూడూరు మండలంలోని మారుమూల గ్రామాలకు ఆర్టీసీ సౌకర్యం లేక అష్టకష్టాలు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. షాద్‌నగర్ డిపో నుండి వయా షాబాద్-నాగర్‌గూడ- ఎంకమ్మగూడ-మక్తగూడ-రేగడి దోస్వాడ-తిర్మలాపూర్ తదితర గ్రామాల మీదుగా రోజూ రెండు ట్రిప్పులు చొప్పున గతంలో తిరిగేవి. చేవెళ్లకు మరో రెండు ట్రిప్పులు నడిచేవి. ఈ ప్రాంత ప్రజలు వాణిజ్య అవసరాలకు, విద్యార్థులు కళాశాలలకు రోజూ చేవెళ్ల, షాద్‌నగర్, శంషాబాద్, షాబాద్, నాగర్‌గూడ వంటి పట్టణాలకు రాకపోకలు చేయటానికి అనువుగా ఉండేది. అయితే గత నెల నుండి ఆర్టీసీ బస్సులు నిలిచిపోవడంతో కద్మూరు, మిట్టకంకల్ గ్రామాలతోపాటు షాబాద్ మండలం పరిధిలోని నాగర్‌గూడ, ఎంకమ్మగూడ, మక్తగూడ, రేగడి దోస్వాడ, తిర్మలాపూర్ తదితర గ్రామాల ప్రజలు రవాణా సౌకర్యం కోల్పోయారు. అదేవిధంగా వికారాబాద్ డిపో బస్సును మండలం పరిధిలోని అంగడి చిట్టంపల్లి, చెన్‌గోముల్, మేడిపల్లి కలాన్, కంకల్, చింతల్‌పల్లి గ్రామాల మీదుగా నడిచే సర్వీసును ఆర్టీసి కార్మికుల సమ్మె నేపథ్యంలో రద్దు చేసి.. ఇప్పటి వరుకు పునరుద్ధరించలేదని వివరించారు. విద్యాసంస్థలు పునఃప్రారంభమైతే విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పారు. రద్దు చేసిన బస్సులను పునరుద్ధరించాలని కోరుతూ బుధవారం షాద్‌నగర్ డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు.


బొంతకుంట వాగును పరిశీలిస్తున్న హైడ్రా సిఐ రాజశేఖర్

## చెక్‌డ్యాంలో మట్టి తొలిగించకపోతే కఠిన చర్యలు

**ఘట్‌కేసర్ రూరల్, మే 20, ప్రభాతవార్త:** పోచారం డివిజన్ పరిధిలోని యంనంపేట్ బొంతకుంట వాగును బుధవారం హైడ్రా అధికారులు సందర్శించి పరిశీలించారు. యంనంపేట్‌లోని బొంతకుంట వాగుతో పాటు వాగుపై గతంలో నిర్మించిన చెక్‌డ్యాంలోకి రీయల్ వ్యాపారస్తులు మట్టిపోసి చదును చేయడంతో డివిజన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మెట్టు గణేశ్ యాదవ్ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. దీంతో హైడ్రా అధికారులు సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఫిర్యాదు దారుడు మెట్టు గణేశ్ యాదవ్‌తో పాటు డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డిలు పరిశీలించారు. సదరు రీయల్ వ్యాపారిని పిలిపించి వెంటనే వాగులో పోసిన మట్టితో పాటు చెక్‌డ్యాంలో నింపిన మట్టిని అక్కడి నుండి పది రోజులలో తొలగించాలని లేనిచో హైడ్రా ఆధ్వర్యంలో కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. పది రోజుల్లో మట్టిని తొలగిస్తామని రీయల్ వ్యాపారి హామీ ఇచ్చారు. వాగులు, చెరువు కుంటలు అక్రమణకు గురైతే కఠిన చర్యలుంటాయని హైడ్రా సీఐ రాజశేఖర్ అన్నారు.

## కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నేతలు

**కుల్కచర్ల, మే 20, ప్రభాతవార్త:** రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు భీంరెడ్డి, మార్కెట్ కమిటి ఛైర్మన్ ఆంజనేయులు,బండల అధ్యక్షులు గోపాల్ నాయక్ అన్నారు. మండల పరిధిలోని చెల్లాపూర్ గ్రామంలో బుధవారం ఐకెపి ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. రైతులు ధాన్యం పూర్తిగా అరబేట్టి కేద్రానికి తెవలన్నారు.ధాన్యం తీసుకొచ్చిన రోజే పూర్తి వివరాలు రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. తేమ శాతం పరిసిలించి,ధాన్యం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శంకుతల కేశవులు, ఎపిఎం శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మాజి అధ్యక్షులు వెంకటయ్య గౌడ్, సినియర్ నాయకులు కృష్ణరెడ్డి, ఉప సర్పంచ్ ఆంజనేయులు, బిజెపి మండల ఉపాధ్యక్షులు కొండ అంజనేయులు, వెంకటయ్య బాను, మహిళ సంఘాల సభ్యులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## తేనెటిగల దాడిలో 30 మంది కూలీలకు గాయాలు


బాధితులను పరామర్శిస్తున్న నేతలు

**కుల్కచర్ల, మే 20, ప్రభాతవార్త :** కుల్కచర్ల శివారులో ఉపాధి హమి కూలీపనులు చేస్తున్న క్రమంలో ఒక్కసారిగా తేనెటిగల దాడి చేశాయి. ఈ ఘటనలో 30 మందికి పైగా గాయాలయ్యాయి. బాధి తులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు భింరెడ్డి, మార్కెట్ కమిటి ఛైర్మ న్ ఆంజనేయులు, కుల్కచర్ల సర్పంచ్ ఆంజిలయ్య భాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రజలు ఉపాధిహామీ పనులకు వెళ్లే క్రమంలో తగు జాగ్రతలు తీసుకువాలని సూచించారు.

## రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

-మృతుడు భువనగిరి వాసి

**ఘట్‌కేసర్, మే 20, ప్రభాతవార్త:** కుటుంబ కలహాలతో ఓవ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బుధవారం ఉదయం 5:30 గంటలకు ఎన్ఎఫ్‌సీనగర్ రైల్వేగేటు సమీపంలో రైలు పట్టాలపై ఒక వ్యక్తి మృతదేహం పడి ఉందని సికింద్రాబాద్ జిఆర్‌పి పోలీసులకు సమాచారం రావడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతుడు యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి రాంనగర్ కాలనీకి చెందిన సంపంగి సురేశ్ (30)గా గుర్తించారు. పోలీసులు కుటుంబసభ్యులకు సమాచారం అందించి విచారణ జరుపగా కుటుంబ తగాదాలతోనే ఆత్మహత్య చేసుకున్నాడని నిర్ధారించారు. భువనగిరి సమీపంలోని అనాజ్‌పూర్ పరిసరాల్లో సురేశ్ రైలు కింద పడగా ముందు రేకులకు చిక్కిన శవం ఘట్‌కేసర్ ఎన్ఎఫ్‌సీనగర్ వరకు రైలు లాకొచ్చిందని అంటున్నారు. మృతదేహానికి పోస్టుమార్టమ్ నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని జిఆర్‌పి పోలీసులు తెలిపారు.

### ప్రజాభాగస్వామ్యంతోనే
## శాంతిభద్రతల పర్యవేక్షణ

**యాలాల మే 20,ప్రభాతవార్త :** ప్రజల రక్షణ.భద్రత కోస మే పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరుగు తోందని తాండూరు డీఎస్పీ ఎన్,యాదయ్య పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా ఆదేశాల మేరకు బుదవారం యా లాల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగ పోలీసులు కాలనీలో నివసిస్తున్న వారి ఆధార్ కార్డులు క్షుణ్ణంగా పరిశీలించారు. అదేవిధంగా సరైన పత్రాలు లేని 30 ద్విచక్రవాహనాలు, 6 ఆటోలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాలనీలో అనుమానాస్పదంగా ఏవైనా ఉంటే, లేదా అనుమానాస్పద వ్యక్తుల సమాచారాన్ని పోలీసులుకు అందజేయాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలను నివారించడంలో ప్రజలు పోలీసులు సహకరించాలని డిఎస్పీ కోరారు. ఈ కార్య క్రమంలో తాండూరు సిఐలు పరమేష్, ప్రవీణకుమార్ రెడ్డి, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు



## వికలాంగులకు వీల్‌చైర్లు బహూకరణ

**జవహర్‌నగర్, మే 20, ప్రభాతవార్త :** జవహర్‌నగర్ బిఆర్ఎస్ అధ్యక్షుడు భాషావోని కొండల్ ముదిరాజ్ 50వ జన్మదిన వేడుకలు మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నివాసంలో వైభవంగా నిర్వహిం చారు. తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర జనరల్ సెక్రటరీ మెరుగు శివకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం సేవా కార్యక్రమాలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా వికలాంగులకు శాలువాలతో ఘన సత్కారం నిర్వహించి, వీల్‌చైర్లు అందజేయడం ద్వారా కొండల్ ముది రాజ్ తన సేవా మనసును చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో జవహర్‌నగర్ బిఆర్ఎస్ మాజీ మేయర్, సీనియర్ నాయకులు, సామాజిక కార్యకర్తలు, సీనియర్ జర్నలిస్టులు, చింతల విజయ్ కుమార్, దుర్గం స్వామి, జినుక రఘు పాల్గొన్నారు.

## వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**పూడూరు, మే 20, ప్రభాతవార్త :** గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓవ్యక్తి అక్కడిక్కడే మృతిచెందిన సంఘటన వికారాబాద్ జిల్లా పూడూరు మండలం సోమన్‌గుర్తి స్టీల్ ఫ్యాక్టరీ సమీపం లో హైద్రాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై చోటు చేసు కుంది. చెన్‌గోముల్ ఎస్ఐ భరత్‌కుమార్‌రెడ్డి కథనం ప్రకారం పూడూరు మండలం పరిధిలోని మేడికొండ గ్రామానికి చెందిన అబ్దుల్ హఫీజ్‌మియా (50) అనేవ్యక్తి మంగళవారం రాత్రి సుమారు 9-40 గంటల ప్రాంతంలో పరిగినుండి మేడికొండ గ్రామానికి తన సొంత టివిఎస్ ఎక్సల్ వాహనంపై బయలు దేరాడు.మార్గమధ్యలో పూడూరు మండలం పరిధిలోని సోమన్‌గుర్తి స్టీల్ ఫ్యాక్టరీ సమీపంలోకి రాగానే మన్నెగూడ వైపునుండి పరిగి వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం టివిఎస్ ఎక్సల్ వాహనాన్ని ఢీకొట్టింది.దీంతో టివిఎస్ ఎక్సల్ వాహనంపై వెళుతున్న అబ్దుల్ హఫీజ్‌మియాకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు నవాజ్ పిర్యాదుమేరకు చెన్‌గోముల్ పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## మైసమ్మ సేవలో ట్రిబ్యునల్ ఛైర్మన్ రాంరెడ్డి



**కడ్తాల్ మే 20, ప్రభతవార్త :** కడ్తాల్ మండలం మైసిగండి గ్రామంలోని మైసమ్మ ఆలయంలో తెలంగాణ రాష్ట్ర ట్రిబ్యు నల్ ఛైర్మన్ సూదిని రాంరెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర పంచాయతీ ట్రిబ్యునల్ ఛైర్మన్ సూదిని రాంరెడ్డి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ప్రజా ప్రతినిధులకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి శాలువాలతో సన్మానించి అమ్మవారి ఆశీస్సులు అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్, ఏఎంసి ఛైర్మన్ యట గీత నరసింహ, వైస్ ఛైర్మన్ గుడురు భాస్కర్ రెడ్డి, సర్పంచులు రాయి కంటి బిక్షపతి, ప్రేమ జవహర్, గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.


గోరిడ్డ తాండలో నూతన బోరు వేయిస్తున్న సర్పంచ్

## తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు

**కుల్కచర్ల, మే, 20 ప్రభాతవార్త :** గ్రామంలో తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యల తీసుకుంటామని సర్పంచ్ అంబిక లాలు నాయక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని గోరిగడ్డ తండా గ్రామ పంచాయతీ నూతన బోరు వేయించారు. అనంతరం రోడ్ల చదును చేయించి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అంబిక లాలు నాయక్ మాట్లా డుతూ.. వెసవి కాలం దృష్టిల ఉంచుకోని గ్రామంలో నీటి సమస్య ఎక్కడ ఉన్న వెంటనే పరిష్కరిస్తునట్లు తెలిపారు.తాగు నీటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపడు తున్నమని పేర్కొన్నారు. ప్రజలు నీటిని వృద చేయాకుండా పొదుపు వాడుకొవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కామ్మూరుదిన్, వార్డు సభ్యులు శంకర్ తదితరులు పాల్గొన్నారు

## ఆలయ భూములు పరిరక్షించాలి

(మొదటి పేజీ తరువాయి)

కొంతమంది ప్రభావశీలుల ఒత్తిళ్ల కారణంగా విచారణలు నిష్పక్షపాతంగా సాగలేదని కూడా గ్రామస్తులు అభిప్రాయపడ్డారు.అలాగే ఆలయ భూములపై ప్రస్తుతం సాగు, క్రయవిక్రయాలకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనివల్ల భవిష్యత్తులో దేవస్థాన ఆస్తులు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత భూములపై స్టే విధించి, పూర్తి స్థాయి రెవెన్యూ, ఎండోమెంట్ సంయుక్త విచారణ చేపట్టాలని కోరారు.అక్రమంగా జారీ చేసిన ఓఆర్ సి ని రద్దు చేసి, అసలు రికార్డుల ఆధారంగా ఆలయ భూములను రక్షించాలని, ఈ వ్యవహారంలో బాధ్యులైన అధికారులు మరియు వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డిని వినతిపత్రం ద్వారా కోరారు.

## వైభవంగా చలం సాహిత్య స్మారకోపన్యాసం

**రవీంద్రభారతి, మే 20 ప్రభాతవార్త :** చలం భావన కన్వీనర్ ప్రముఖ సాహితీవేత్త డా. నాళేశ్వరం శంకరం సభాధ్యక్షతలో జీవజలం చలం సాహిత్య స్మారకోపన్యాస సభ వైభవంగా జరిగింది. చలం పౌరాణిక సాహిత్యం- వస్తు రూపాలపై ఎన్.వేణుగోపాల్, కుప్పిలి పద్మ ప్రసంగించారు. చలం పౌరాణిక నాటిక, నాటకాలలోఇ కొన్ని ముఖ్యభాగాలను భండారు విజయ, జ్వలిత, అరుణ ధూళిపాల, గడ్డం సులోచన వినిపించారు. డా. ఏనుగు నరసింహారెడ్డి ఆప్తవాక్యంలో నాళేశ్వరం శంకరం తన పరిశోధనను జీవితమంతా విస్తరింపజేశారన్నారు. చలం ఏమిచెప్పారో అందరికీ తెలియాలి. నాటకాల్లోని పౌరాణిక పాత్రల్లో ఆధునిక భావాలున్నాయి. ఆయన భావజాలం చేత విమర్శలు ఎదుర్కొన్నాడు. ఆయన ఆదర్శానాకి ఈరోజున్న రిలవెన్స్ కూడా చూడవలసి ఉందన్నారు. చలంను సరికొత్తగా అర్థం చేసుకోవాల్సి ఉందన్నారు. వేణుగోపాల్ చలం పౌరాణిక సాహిత్యం వస్తురూపాలపై ప్రసంగించారు. చలం పౌరాణిక సాహిత్యం ఇప్పటికీ చర్చనీయాంశంగా రాలేదు. పౌరాణిక వస్తువు విశిష్టమైం ది. వంద సంవత్సరాలు దాటినా రిలవెన్సీ పెరిగింద న్నారు.

# ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలి

### కలెక్టర్ సి.నారాయణ రెడ్డి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

**రంగారెడ్డి అర్బన్, మే 20, ప్రభాతవార్త:** ఎంజీఎన్ఆర్ఈజీఎస్, మహిళా స్వయం సహాయక సంఘాలు, నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం (ఎన్ఎఫ్‌బీఎస్) తదితర అంశాలపై బుధవారం హైదరాబాద్ నుంచి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, సెర్ప్ సీఈవో దివ్య అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా సీఈవో దివ్య మాట్లాడుతూ ఉపాధి హామీ పనులను వేగవంతం చేసేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. కొత్త జాబ్ కార్డులను మంజూరు చేయడంతో పాటు ఉపాధి హామీ కూలీలు పూర్తి స్థాయిలో పని దినాలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అలాగే నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం, చేయూత పథకాల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ప్రయోజనాలు చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.దివ్యాంగులకు దేశవ్యాప్తంగా ఒకే విధమైన గుర్తింపునిచ్చే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూడీఐడీ (యూనిక్ డిసెబిలిటీ ఐడెంటిటీ) కార్డులను అర్హులైన వారందరికీ అందేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మహిళా స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్‌లో లేబర్ కాంపోనెంట్, వేజ్ కాంపోనెంట్ పనులను ఎంపీడీవోలు ఎట్టి పరిస్థితుల్లోనూ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలలో భాగంగా జిల్లాలో 287 వివో భవనాలకు మంజూరు లభించగా, వాటిలో కొన్ని పనులు ప్రారంభమైనప్పటికీ ఇంకా 89 భవనాల నిర్మాణ పనులు ప్రారంభం కాలేదని, మిగిలిన పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. అలాగే ఐడీలు జనరేట్ చేసిన వాటికి సంబంధించి పేమెంట్ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం కింద కుటుంబ పెద్ద మరణించిన పక్షంలో ప్రభుత్వం నుంచి రూ.20 వేల ఆర్థిక సాయం అందుతుందని, ఈ పథకం అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా ఎంపీడీవోలు కృషి చేయాలని ఆదేశించారు.అదేవిధంగా రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి మండలంలో డ్రైవ్ మోడ్‌లో చేపట్టి కనీసం 200 మంది సభ్యులను చేర్చాలని సూచించారు.ఈ సందర్భంగా డీఆర్‌డీఏ బ్యాంక్ లింకేజీలో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అవార్డు సాధించినందుకు జిల్లా అధికారులను కలెక్టర్ అభినందించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్మయి, జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, డీఆర్‌డీఓ పీడీ శ్రీలత, డీపీవో సురేశ్ మోహన్, అడిషనల్ పీడీ సుభాషిణి, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు అధికారులు పాల్గొన్నారు.

## చిత్ర రంగంపై ఆధారపడిన వారికి పూర్తి సహకారం అందిస్తా

**సైఫాబాద్, మే 20 ప్రభాతవార్త:** ఫిల్మ్ అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టిపిసి) తెలంగాణ రాష్ట్ర హెల్త్ కమిటీ నూతన ఛైర్మన్ ఎస్.కుర్మారావు నియమితులైనారు. ఈ మేరకు బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయనకు ప్రముఖ సినీ నటులు రవీందర్, వనితాచందర్ తదితరులు నియామక ప త్రాన్ని అందజేసి అభినందనలు తెలి యజేశారు. ఈ సందర్భంగా కూర్మారావు మాట్లాడుతూ చిత్ర రంగంపై ఆధారపడిన వారికి తన వంతు సహకారం పూర్తిగా అందిస్తానని చెప్పారు.

రాష్ట్ర హెల్త్ కమిటీ ఛైర్మన్‌గా తనను నియమించడం వల్ల తనపైన మరింతగా బాధ్యత పెరిగింద న్నారు. సినీ నటులు మాట్లాడుతూ ఎఫ్‌టిపిసి ఇండియా గ్లోబల్‌లో ఎంతో ప్రేరు ప్రఖ్యాతలు గడించినది ఈ సంస్థనేని అని కొనియాడారు. ఎఫ్‌టిపిసి ఇండియా అధ్యక్ష, కార్య దర్శులు జంగా చైతన్య, పాకలపాటి విజయ్‌వర్మ మాట్లాడు తూ ఫిల్మ్ టూరిజం అభివృద్ధి చేయడంలో కూర్మారావు తప్పక సఫలీకృతం అవుతారని అశాభావం వ్యక్తం చేశారు. కూర్మారావు ఆరోగ్య రంగంలో గత రెండు దశాబ్ధాలుగా వివిధ కార్పోరేట్ హాస్పటల్స్‌లో పనిచేసిన అనుభవం, నిర్వహణ కా ర్యక్రమాల చొరవ తమను ఎంతగానో అకట్టుకున్నాయనా న్నరు. ప్రతి మనిషికి ఆరోగ్యంపై ఎంతో శ్రద్ద అవసరమని సినీ రంగంలోని 24 క్రాఫ్ట్స్, చిత్ర రంగంపైన ఆధారపడినవారు వారి కుటుంబ సభ్యులకు అతి తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో ఎఫ్‌టిపిసి సభ్యులు జి.మధుకర్, ఎం.ఈశ్వర్‌రావు, తెలంగాణ మీడియా ఛైర్మన్ కిరణ్ బేజాడి, కోడె చైతన్య, నటి భవనా నల్కర్ పాల్గొన్నారు.

## వెంటనే స్వర్ణకార కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి


సమావేశంలో నిరసన తెలుపుతున్న స్వర్ణకారులు

**సైఫాబాద్, మే 20 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని 12 లక్షల మంది స్వర్ణకారుల భవిష్యత్ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్వర్ణకారుల కార్పోరేషన్‌లను ఏర్పాటు చేసి అదుకోవాలని తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘం డిమాండ్ చేసింది. పది రోజుల్లోగా ప్రభుత్వం ప్రకటన చేయకపోతే వేలాది మందితో రాష్ట్ర మహాసభ ఏర్పాటు చేసి అసెంబ్లీని ముట్టడిస్తామని సంఘం నాయకులు హెచ్చరించారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వింజమూరి రాఘవాచారి, చేపూరి వెంకటస్వామి, కోశాధికారి గొట్టిముక్కల చంద్రశేఖర్ మాట్లాడుతూ స్వర్ణకారుల కార్పోరేషన్ కోసం గత పది సంవత్సరాలుగా తాము రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలను కలిసి చెప్పులు అరిగిపోయోలా విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాలలో స్వర్ణకారులకు పనులు లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం స్వర్ణకారులను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి పిసిసి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు స్వర్ణకారులకు కార్పోరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచేస్తామని హామీచ్చారని, ఆ హామీని నేటి వరకు అమలు చేయలేదన్నారు. వెంటనే కార్పోరేషన్‌ను ఏర్పాటు చేసి ప్రతి స్వర్ణకారునికి వడ్డీలేని రుణాలు పది లక్షల వరకు ఇవ్వాలని, కార్పోరేషన్‌ను తమ సంఘ నాయకులతో చర్చించి పాలక మండలిని నియమించాలని, 50 సంత్సరాలు నిండిన ప్రతి స్వర్ణకారునికి 4 వేలు ఫించెన్ చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశం సంఘం రాష్ట్ర కార్యదర్శి రాగిఫణి సతీష్‌కుమార్, కిషన్, సంతోష్, మనోరమ, భీష్మాచారి తదితరులు పాల్గొన్నారు.

## జలమండలిలో 'గుర్తింపు సంఘానికి' మోగిన ఎన్నికల నగారా

**- ఎంప్లాయిస్ యూనియన్‌కు మేవా మద్దతు**
**- సెక్షన్ కార్యాలయాల నుండి ప్రచారం షురూ**


తన కార్యాలయంలో రాజిరెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే బలాల

**చాంద్రాయణగుట్ట, మే 20, ప్రభాతవార్త :** హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సివరేజ్ బోర్డు (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి) గుర్తింపు యూనియన్ కోసం ఎన్నికల నగారా మోగింది. జూన్ ఆరున ఎన్నికలు జరుగనున్నాయి. వివిధ యూన్‌యన్లు ఎన్నికల్లో పోటీ పడేందుకు సమాయత్తం అవుతున్నాయి. తెలంగాణ జల మండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ళ రాజిరెడ్డి ఒకడుగు ముందుకు వేసి తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. పాతబస్తీలోని మొఘల్‌పురా సెక్షన్ ఉద్యోగులతో సమావేశమైయ్యారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను, న్యాయమైన డిమాండ్లను విన్నారు. జలమండలి ఎన్నికలలో అభ్యర్థుల గెలుపు, ఓటములను శాసించే ముస్లీం ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసి యేషన్ (మేవా) మద్దతు కోరారు. సమావేశం నుండి నేరుగా మలక్‌పేట్ శాసనసభ్యులు, మేవా వైస్ ఛైర్మన్ అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల నివాసానికి వెళ్ళారు. అతని మద్దతును కూడ గట్టారు. ఎమ్మెల్యేను సన్మానించారు. ప్రతిగా ఎమ్మెల్యే బలాల, రాజిరెడ్డిని సన్మానించి అభినం దించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడు తూ మేవా బలపర్చిన ఎంప్లాయిస్ యూనియన్ ప్యానల్ ను గెలిపించాలని సూచించారు. జలమండలి ఉద్యోగుల సమస్యలు, న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించే యూనియన్‌ను అండగా నిలవాలన్నారు. కాగా జలమండలిలో ప్రతి నెల ఎంతో మంది ఉద్యోగ విరమణ చేస్తున్నారు. దీంతో ఉద్యోగుల సంఖ్య క్రమేణ తగ్గుతూ పోతుంది. నియామకాలు చేపట్ట క పోవటంతో ఉన్న శాశ్వత ఉద్యోగులతో నెట్టుకు వస్తున్నారు. గతంలో ఐదు వేల వరకు ఉన్న ఉద్యోగులు నాలుగు నుండి మూడు వేలకు తగ్గిపోయారు. వీరికే ఎన్నికలలో ఓటు వేసే అవకాశం ఉంది. అధిక శాతం ఉద్యోగులు ఏ యూనియన్ వెంట ఉంటే వారు విజయం సాధించినట్లే. ఎమ్మెల్యే బలాలను కలిసిన వారిలో మేవా ప్రధాన కార్యదర్శి సయ్యద్ అక్తర్ అలీ, ఉద్యోగులు మజహారుద్దీన్, ముహమ్మద్ అన్వర్, షేక్ ఇబ్రహీం, ఎం.ఎ.రషీద్, రవిందర్, ముహమ్మద్ సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ ప్రవేశంలో వివక్ష వద్దు


విచారణలో పాల్గొన్న రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషనర్ మెంబర్ జిల్లా శంకర్, జిల్లా కమిటీ సభ్యులు, మున్సిపల్ ఛైర్మన్

**శామీర్‌పేట, (మేడ్చల్ జిల్లా ప్రతినిధి), మే 20, ప్రభాతవార్త :** ఇటీవల అద్రాస్‌పల్లి గ్రామంలో దళితులకు అవమానం జరిగిందన్న ఫిర్యాదుతో కొందరిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు కావటంతో ఈ కేసుకు సంబంధించి గ్రామ రామాలయంలో రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ మెంబర్ జిల్లా శంకర్ సమక్షంలో బుధవారం విచారణ జరిగింది. అద్రాస్‌పల్లి గ్రామానికి విచారణ నిమిత్తం రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ మెంబర్ జిల్లా శంకర్, జిల్లా డివిసి మెంబర్లు బి.వెంకటేశ్వర్లు, ధన్‌రాజ్‌నాయక్, పాకాల అశోక్, దళితసమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు బిఎన్ రాంమోహన్, మూడుచింతలపల్లి మున్సిపల్ ఛైర్మన్ జాము రవి, కౌన్సిలర్లు పులి ప్రభాకర్, అజయ్‌కుమార్, మాజీ సర్పంచు నాగేశ్వర్‌చారి, జిల్లా డిఎస్‌సిడిఓ వినోద్‌కుమార్, జవహర్‌నగర్ ఎసిపి చక్రపాణి, ఎంసిపల్లి తహసీల్దార్ ఎండి గులాం ఇద్రీస్, శామీర్‌పేట సిఐ శ్రీనాథ్, ఎఎస్‌సిడిఓ మేడ్చల్ వారితో పాటు గ్రామానికి చెందిన ఇరువర్గాల కులపెద్దలు, ప్రజలు పాల్గొన్నారు. గ్రామానికి చెందిన ఇరువర్గాల కులపెద్దలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు. అయితే ఇటీవల శ్రీరామ నవమి రోజున శ్రీసీతారాముల కల్యాణోత్సవం జరిగి కొందరు దళితులను ఆలయంలోకి రావద్దని అడ్డుకున్నారన్న విషయంపై శామీర్‌పేట పోలీసులకు బాధిత దళితుల నుంచి ఫిర్యాదు అందటంతో విచారణ జరిపారు. దీనికి సంబంధించి ముగ్గురిపై కేసు నమోదు అయిన సంగతి తెలిసిందే. ఆలయాల ప్రవేశం, వివక్షలకు సంబంధించిన వాటి గురించి ప్రజలకు వారు అవగాహన కల్పించారు. ఆ తరువాత వారి సమక్షంలో అద్రాస్‌పల్లి గ్రామంలో ఇక ముందు అన్ని పండుగలు సాంప్రదాయపద్ధతిలో ఒకరినొకరు గౌరవించుకుని ఆలయప్రవేశంలో గాని, ఉత్సవాల్లో వివక్ష చూపరాదని తీర్మానించారు. ఇటీవల ముగ్గురిపై ఈ విషయంలో ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు అయినందున ఈ కేసులు కూడ వెనక్కి తీసుకుంటామని అందరు సంయుక్తంగా సంతకాలు చేశారు.



కార్మికుని కుటుంబ సభ్యులకు పరిహారపు చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేస్తున్న హెచ్ బి ఎల్ యాజమాన్యం

## కార్మికుని కుటుంబానికి రూ.10 లక్షల చెక్కు అందజేత

**నందిగామ, మే 20, ప్రభాతవార్త :** నందిగామలోని హెచ్ బి ఎల్ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తూ గత కొన్ని రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందిన మల్లేష్ కుటుంబ సభ్యులకు హెచ్బిఎల్ పరిశ్రమ హెచ్ ఆర్ మేనేజర్ అబ్దుల్ కలాం బుధవారం షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా రూ.10 లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో అంతి రెడ్డి గూడ సర్పంచ్ గడ్డల మంజుల యాదగిరి, కొమ్ము కృష్ణ, అంతిరెడ్డి గూడ,నందిగామ ఉప సర్పంచ్ లు జంగ మల్లేష్, వెంకటేష్ గౌడ్ ,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డి కుమార్ గౌడ్ , మాజీ అధ్యక్షుడు జంగ నరసింహులు,హెచ్బిఎల్ నిర్వాకులు కృష్ణారెడ్డి, రాజశేఖర్ రెడ్డి , శ్రీకాంత్ గౌడ్, సిద్దాపూర్ శేఖర్ రెడ్డి, వార్డు సభ్యులు ఎంబడి అంజి యాదవ్, గడ్డల శ్రీశైలం, దేపల్లె శేఖర్, దేపల్లె శ్రీశైలం తదితరులున్నారు. అంతకుముందు ఎమ్మెల్యే అయ్యప్ప స్వామి దేవాలయంలో పూజలు చేసి ప్రసాదం స్వీకరించారు.

## ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రజా పాలన లక్ష్యం

**అండర్ డ్రైనేజీ నిర్మాణం పనులకు భూమి పూజ**



సిడితండ రెడ్డి కాలనీలో అండర్ డ్రైనేజ్ నిర్మాణపరులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.

**నందిగామ, మే 20, ప్రభాతవార్త:** అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలన లక్ష్యమని ఆ దిశగా సీఎం రేవంత్ రెడ్డి ఆరోగ్య తెలంగాణ కోసం ప్రగతివైపు అడుగులు వేస్తున్నారని షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. బుధవారం నందిగామ మండలం సిడితండా గ్రామపంచాయతీ సర్పంచ్ గబ్రు చౌహన్ ఆధ్వర్యంలో రెడ్డికాలనీలో డి ఎం ఎఫ్ టి నిధులు రూ.30 లక్షల వ్యయంతో అండర్ డ్రైనేజ్ నిర్మాణ పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచినా రెండున్నర ఏళ్ల కాలంలో అన్ని మౌలిక వసతులతో పల్లెలు పట్టణాలను తలపిస్తున్నాయని పేర్కొన్నారు. సమస్యలుంటే తన దృష్టికి తేవాలని నిధులు ఇస్తా సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. యువ సర్పంచులు పార్టీలకతీతంగా అందరిని కలుపుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ చక్రధర్ గౌడ్, ఆర్ఐ శ్రీనివాస్ ,మాజీ ఎంపీపీ ఎం శివశంకర్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుమార్ గౌడ్, మాజీ అధ్యక్షుడు జంగ నరసింహులు, ఉప సర్పంచ్ రవీందర్ నాయక్, మాజీ సర్పంచ్ జటావత్ రాజు నాయక్, సర్పంచులు కొమ్ము కృష్ణ, బుగ్గ సాలయ్య, గొర్లపల్లి అశోక్, గోవు రవికుమార్, ఉప సర్పంచ్ బసవరాజు, మాజీ ఎంపీటీసీ చంద్రపాల్ రెడ్డి, సిడి తండా సెక్రటరీ రవీందర్, వార్డు సభ్యులు జటావత్ రాజేష్,పాత్లావత్ బుజ్జి శంకర్ నాయక్, పాత్లావత్ శ్రీను, శాంతి శ్రీను, మెగావత్ నాగేష్, పత్తి శ్రీను, డైరెక్టర్ రూప్ సింగ్,కాంగ్రెస్ నాయకులు కావలి కృష్ణ, పసుల బుచ్చయ్య, జటావత్ విజయ్ నాయక్, జ్ఞానేశ్వర్, జింకల జంగయ్య యాదవ్, శ్రీకాంత్ రెడ్డి, గడ్డం జంగయ్య తదితరులు ఉన్నారు.

## మాన్యువల్స్‌కు మరమ్మత్తులు

**కాలనీలను పరిశీలించిన సర్పంచ్ కొమ్ము కృష్ణ**

**నందిగామ, మే 20, ప్రభాతవార్త :** ప్రజలందరూ బాగుండాలనే సంకల్పంతో నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ వినూత్న రీతిలో కాలనీలో ఉన్న మాన్యువల్సును పునరుద్ధరిస్తూ ముందుకు సాగుతున్నారు. బుధవారం గ్రామంలో ఉన్న 9వ వార్డులో డ్రైనేజీ మరమ్మతులు దగ్గరుండి చేపించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు చించేటి లత శివకుమార్ గౌడ్, నాయకులు సురేష్, సీఎం నరేందర్ రెడ్డి, కృష్ణ గౌడ్, శివయ్య, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



నందిగామ తొమ్మిదో వార్డులో అండర్ డ్రైనేజ్ పనులను చేయిస్తున్న సర్పంచ్ కొమ్ము కృష్ణ.

## ఉరి వేసుకుని నాట్కో కార్మికుడు మృతి

**నందిగామ, మే 20, ప్రభాతవార్త :** నందిగామ మండలం రంగాపూర్ శివార్లో ఉన్న మెట్రో



పరిశ్రమ గేటు ముందు కిషోర్ శవంతో ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు.

సిటీ వెంచర్లో బుధవారం మధ్యాహ్నం నాట్కో కార్మికుడు కిషోర్ (24) అనే వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తోటి కార్మికులు తెలిపారు. కిషోర్ మృతి చెందాడని సమాచారం తెలిసిన కుటుంబ సభ్యులు, తోటి కార్మికులు నాట్కో పరిశ్రమ నిర్వాహకుల వేధింపుల తోటే మృతి చెందాడని అనుమానంతో మృతుని శవాన్ని నాట్కో ఫార్మా గేటు ముందు ఉంచి నిరసన తెలిపారు. న్యాయం కోసం మృతుని కుటుంబ సభ్యులు, స్థానిక గిరిజన నేతలు, కార్మిక నేతలు నాట్కో ప్రతినిధులతో మాట్లాడి అనంతరం శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. మృతుడు కిషోర్ ప్రకాశం జిల్లా, ఒంగోలు సింగరాయకొండకు చెందిన వాడని గత నాలుగేళ్ల గా రంగాపూర్ లో నివాసం ఉంటూ స్థానిక నాట్కోలోయూనిటీ ఫ్లోర్‌లో పనిచేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సంఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నందిగామ ఇన్స్పెక్టర్ ప్రసాద్ నేతృత్వంలో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

**అప్పుల బాధతో వీడియో మెసేజ్**

## దినేష్ అదృశ్యం కలకలం

**జవహర్ నగర్, మే 20. ప్రభాతవార్త:** జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని.ఫిర్యాదుదారు భోనగిరి భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం, తన సోదరి బి. స్వప్న 2018 సంవత్సరంలో ఖ్మతి దినేష్‌ను వివాహం చేసుకుని ఒక కుమారుడు, ఒక కుమార్తెకు జన్మనిచ్చింది. అనంతరం 2021లో ప్రసవ సమయంలో స్వప్న మృతి చెందింది. అప్పటి నుంచి దినేష్ తన కుమారుడితో కలిసి జవహర్‌నగర్‌లో నివసిస్తుండగా, కుమార్తె ఫిర్యాదుదారు



కుటుంబం వద్ద ఉంటోంది. ఉదయం సుమారు 5:30 గంటల సమయంలో దినేష్ నుంచి వాట్సాప్ వీడియో సందేశం రావడంతో కుటుంబ సభ్యులు కలవరపడ్డారు. అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్య చేసుకోవాలనుకుంటున్నట్లు వీడియోలో పేర్కొన్నాడని భాస్కర్ తెలిపాడు. వెంటనే దినేష్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చినట్లు చెప్పారు.దీంతో ఆందోళన చెందిన భాస్కర్ నందమూరి నగర్‌లోని దినేష్ ఇంటికి వెళ్లి చూడగా ఇంటి తలుపు బయట నుంచి లాక్ చేసి ఉండటంతో అనుమానం వచ్చిందన్నారు. తలుపు పగులగొట్టి లోపలికి వెళ్లగా దినేష్ మొబైల్ ఫోన్ ఇంట్లోనే కనిపించిందని తెలిపారు. పరిసర ప్రాంతాల్లో వెతికినా దినేష్ ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించినట్లు పేర్కొన్నారు.ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

**ఆన్‌లైన్ ఫార్మసీల నియంత్రణకు డిమాండ్...**

# మెడికల్ షాపుల బంద్



ధారూర్‌లో..

**ధారూర్, మే 20, ప్రభాత వార్త:** ధారూర్ మండల కేంద్రంలో మెడికల్ షాపుల బంద్ సంపూర్ణంగా జరిగింది. రాష్ట్ర కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ పిలుపు మేరకు స్థానిక కెమిస్టులు, మెడికల్ షాపుల యజమానులు తమ దుకాణాలను పూర్తిగా మూసివేశారు. ఆన్‌లైన్ ఫార్మసీల ద్వారా విచ్చలవిడిగా సాగుతున్న మందుల అమ్మకాలను వెంటనే నియంత్రించాలని, కార్పొరేట్ సంస్థలు ఇస్తున్న విపరీతమైన డిస్కౌంట్లతో స్థానిక చిన్న వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

అంతేకాకుండా, ఆన్‌లైన్ వేదికలపై ఎలాంటి నియంత్రణ లేకుండా నకిలీ, నాణ్యత లేని మందులు అమ్ముతున్నారని, దీనివల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని మెడికల్ షాప్ యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తూ ప్రభుత్వాన్ని తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే, నిరసనలో భాగంగా మెడికల్ షాపులన్నీ ఒకేసారి మూతపడటంతో అత్యవసర మందుల కోసం వచ్చిన రోగులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

### మెడికల్ షాపుల బంద్ విజయవంతం

**కొడంగల్,మే 20,ప్రభాతవార్త:** అన్‌లైన్‌లో ఔషదాల అమ్మకాలను నిషేదించాలని డిమాండ్‌తో చేపట్టిన మెడికల్ షాపులబంద్ కొడంగల్‌తోపాటు మండల పరిధిలోని రావుపల్లి,రుద్రారం తదితర గ్రామాల్లో విజయవంతమైంది. దేశవ్యాప్తంగా మందుల దుకాణాల బంద్‌లో బాగంగా బుధవారం మెడికల్ అసోసియోషన్ అద్వర్యంలో కొడంగల్ పట్టణంలోని అన్ని మెడికల్ షాపులు తమ మెడికల్ దుకాణాలను మూసివేస్తు బంద్ పాటించారు.

ఈ సందర్భంగా అసోసియోషన్ అధ్యక్షులు,కార్యదర్శులు విద్యాసాగర్,బస్వరాజ్,ఎల్.శ్రీకిషన్‌రావు,అశోక్,పురుషోత్తం,శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ అన్‌లైన్‌లో ఔషదాల అమ్మకాలు పెరుగడం వల్ల కనీసం మన షాప్ అద్దె మెయింటెనెన్స్ కూడా వెళ్ళలేని పరిస్దితి దాపురిస్తుందన్నారు.





కొడంగల్‌లో బంద్ సందర్భంగా మూతపడిన మెడికల్ దుకాణం

అలాగే మంచి కంపెనీల పేరుతో మోసం చేస్తు నకిలీ ఔషదాల సరఫరా జరగడం వల్ల కింది స్దాయిలో ఉన్న మన డిస్ట్రిబ్యూటర్లు,రిటైలర్లు బలి అవుతున్నారని పేర్కొన్నారు.కార్పోరేట్ కంపెనీలకు మాత్రం నేరుగా అధిక డిస్కౌంట్‌తో మందులు ఇవ్వడం వల్ల డ్రగ్ ప్రైస్ కంట్రోల్ పరిధిలో ఉన్న తాము తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ బంద్ ద్వారా తమ ఐక్యతను చాటి,సమస్యల తీవ్రతను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళి తమ డిమాండ్‌ల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో మెడికల్ షాపుల యజమానులు కట్కం పవన్‌కుమార్, ముక్తదీర్,రుక్కుం తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడి కేంద్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్

**శామీర్‌పేట, మే 20, ప్రభాతవార్త:** శామీర్‌పేటలోని అంగన్‌వాడి కేంద్రం-3ను మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సందర్శించారు. బుధవారం శామీర్‌పేటలోని అంగన్‌వాడి కేంద్రాన్ని ఆయన సందర్శించి కేంద్రం పనితీరును, సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ అంగన్‌వాడి కేంద్రానికి ప్రహరీగోడ నిర్మాణం, డ్రైనేజీ సమస్యలు ఉన్నందున వాటిని చేయిస్తామని అదనపు కలెక్టర్ తెలిపినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శారద, ఆర్‌బి ఎఇ దినేశ్‌రెడ్డి, అంగన్‌వాడి టీచరు, తదితరులు పాల్గొన్నారు.





శామీర్‌పేటలోని అంగన్‌వాడి కేంద్రాన్ని సందర్శించిన జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా అధికారి శారద,తదితరుల దృశ్యం

## ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు ప్రజల గోస పట్టదా?

**-ఆధ్వాన రోడ్లతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు**
**-రోడ్డుపై బైఠాయించి బిఆర్ఎస్ నేతల నిరసన**

**రంగారెడ్డి అర్బన్ మే 20,ప్రభాతవార్త :** ఆధ్వానమైన రోడ్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న ప్రజల గోస ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు పట్టాదా అన్ని బిఆర్ఎస్ నేతలు ప్రశ్నించారు.బుధవారం శంషా బాద్ మండలం నర్కూడ గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు బోరుకొండ సతీష్ నేతృత్వంలో శంషాబాద్ నర కూడా రోడ్డుపై కార్యకర్తలతో కలిసి బైఠాయించి ధర్నా దిగారు.ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ ఈ రోడ్డులో పలుసార్లు ప్రయాణించే రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రజలు పడుతున్న ఇబ్బందులు గమనించలేదా అని ప్రశ్నించారు ఈ రోడ్డులో ప్రయాణించే ద్విచక్ర వాహనాల వారు జారి కిందపడి క్షతగాత్రులవుతున్నారన్నారు విద్యార్థులు రైతులు పలు వర్గాల వారు అనునిత్యం ఇదే రోడ్డును ఆశ్రయించి శంషాబాద్‌లోని కూరగాయల మార్కెట్‌తోపాటు దుకాణాల నుంచి నిత్యాసర వస్తువులతో పాటు ఇతరాతన కొనుగోలు చేసుకుని రాకపోకలు సాగిస్తుంటారు అయితే ఈ రోడ్డు బాగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు కొంతమంది అయితే దుమ్ము ధూళితో అస్వస్థత కలిగి ఆసుపత్రుల పాలవుతున్నారని ప్రజల కష్టాలు గమనించి ఎమ్మెల్యే సబితా రెడ్డికి ప్రజలు విన్నవించుకోగా ఆమె గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కర్ణన్‌కు సమాచారం ఇచ్చి రోడ్డు పనులను వెంటనే ప్రారంభించమని చెప్పారు. అయితే ఈ విషయమై శంషాబాద్ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్ ఆమెపై విమర్శలను చేస్తూ సంబంధం లేని ప్రాంతాల కోసం కూడా ప్రస్తావించి రాజకీయం చేస్తున్నాడని న్యాయంగా ఈ రోడ్డు వేయనందున కలుగుతున్న ఇబ్బందుల కోసం టిఆర్ఎస్ నాయకులమంతా పాటుపడుతుంటే ప్రజలు గోతుల్లో పడితే ఏం ఆసుపత్రిలో పడితేనే మన లెక్క లేకుండా కాంగ్రెస్ నాయకులు మతిలేని ప్రకటనలు చేయడం ఈ విషయంపై రాజకీయం చేయడం మానుకోవాలని హెచ్చరించారు. అనంతరం టిఆర్ఎస్ పార్టీ మండల శాఖ నాయకుడు మంచర్ల మోహన్ రావు మాట్లాడుతూ ఏది ఏమైనా త్వరగా తిన రోడ్డు పనులను ప్రారంభించి ప్రమాదాలు నివారించాలన్నారు మాజీ ఎంపీపీ చెక్కల ఎల్లయ్య మాట్లాడుతూ రోడ్డు పనులు కోసం తవ్వకాలు జరిపి పనులు ప్రారంభించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు అన్నారు ప్రజలు కష్టాలు ఏమాత్రం పట్టవా అని ప్రభుత్వంపై గజమెత్తారు స్పందించి త్వరలో పనులు మొదలు పెట్టకపోతే జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమానికి ముందు నరు కూడా చౌరస్తా నుంచి ప్రభుత్వ పాఠశాల గ్రామపంచాయతీ కార్యాలయం కవ్వా కూడా చౌరస్తా పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న బిఆర్ఎస్ నేతలు

## కొద్దిపాటి వర్షానికే రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

**తీవ్ర ఇబ్బందులు పడ్డ ప్రజలు**

**శంకర్‌పల్లి, మే 20, ప్రభాతవార్త :** శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని సింగాపురం ఒకటవ వార్డు ఎస్సీ కాలనీలో మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి రోడ్డుపై ఎక్కడికక్కడే వర్షపు నీరు చేరాయి. దీంతో వార్డు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మహిళలు, చిన్నారులు నానా అవస్థలు పడి అసహనానికి గురయ్యారు. ఈ వర్షానికి వర్షపు నీరు రోడ్లపై ఉంటే వచ్చే వర్షాకాలంలో పరిస్థితి ఏంటని వార్డు ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. వెంటనే మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు స్పందించాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.





## రౌడీషీటర్ల ఇండ్ల తనిఖీ

**శంకర్‌పల్లి, మే 20, ప్రభాతవార్త :** మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలలో ఉన్న రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్ల ఇళ్లకు మోకిల సి.ఐ శ్రీనివాస్‌రెడ్డి వెళ్లి తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా సి.ఐ వారందరికీ మరలా ఎలాంటి నేర కార్యకలాపాలు లేదా కేసుల్లో పాల్గొనకూడదని, సత్ప్రవర్తనతో సమాజంలో మంచి పౌరులుగా ఉండాలని సూచించారు. అలాగే చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు.

## సిపి సుమతిని కలిసిన సుధీర్‌రెడ్డి

**ఘట్‌కేసర్, మే 20, ప్రభాతవార్త:** మల్కాజ్‌గిరి పోలీస్ కమీషనరేట్ సీపీ సుమతిని బుధవారం మేడ్చల్ మాజీ శాసనసభ్యులు మలిపెద్ది సుధీర్‌రెడ్డి కలిశారు. నేరెడ్‌మెట్‌లోని సీపీ కార్యాలయంలో ఆయన సీపీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మల్కాజ్‌గిరి సీపీగా సుమతి ఇటీవల బాధ్యతలు స్వీకరించి కమీషనరేట్ పరిధిలో శాంతి, భద్రతల పరిరక్షణ, మహిళల భద్రత కోసం తీసుకుంటున్న చర్యలపై సుధీర్‌రెడ్డి కొద్దిసేపు ఆమెతో చర్చించారు. ఆయన వెంట ఘట్‌కేసర్ సహకార సంఘం మాజీ డైరెక్టర్ బొక్క ప్రభాకర్‌రెడ్డి, మాజీ వార్డుసభ్యులు బద్దం కుమార్‌లు ఉన్నారు.



మల్కాజ్‌గిరి సిపి సుమతికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

## బాలాజీ నగర్‌లో విషాదం

**పాముకాటుతో గృహిణి మృతి**

**జవహర్‌నగర్, మే 20. ప్రభాత వార్త:** జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని.బాలాజీ నగర్ పద్మశాలి కాలనీలో పాముకాటుతో ఓ గృహిణి మృతి చెందిన ఘటన విషాదాన్ని నింపింది. ఫిర్యాదుదారు సద్దాం హుస్సేన్ తెలిపిన వివరాల ప్రకారం, ఆయన తన భార్య మరియా ఖాతూన్ (29), ముగ్గురు కుమార్తెలతో కలిసి జీవనం సాగిస్తున్నారు. రాత్రి కుటుంబ సభ్యులంతా భోజనం అనంతరం ఇంట్లో నిద్రించారు. వేడి ఎక్కువగా ఉండటంతో ప్రధాన ద్వారం తెరిచి ఉంచి కూలర్ ఆన్‌చేసి నిద్రించినట్లు తెలిపారు.19052026 ఉదయం సుమారు 5 గంటల సమయంలో మరియా ఖాతూన్ అకస్మాత్తుగా తన ఎడమ చేతి వేళ్లను పాము కాటేసిందంటూ కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు అప్రమత్తమయ్యారు.వెంటనే సద్దాం హుస్సేన్ పిల్లలను సురక్షిత ప్రాంతానికి పంపించి, గదిలో ఉన్న పామును కర్రతో కొట్టి చంపినట్లు తెలిపారు. అనంతరం భార్య వేళ్ల పైభాగంలో తాడు కట్టి మీనాక్షి హాస్పిటల్‌కు తరలించగా, అక్కడి నుంచి బాలాజీ నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు ప్రథమచికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్ ద్వారా సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికు రిఫర్ చేశారు.గాంధీఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరియా ఖాతూన్ 20052026 ఉదయం సుమారు 8:31 గంటలకు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

### ఘనంగా పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి

**తలకొండపల్లి, మే 20, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామపంచాయతీ పరిధిలోగల సంగాయపల్లి గ్రామంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సందర్భంగా సంగాయపల్లి గ్రామంలో నూతనంగా సిపిఎం జెండా ఆవిష్కరించి పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అగ్రకులంలో పుట్టిన సుందర రామ్ రెడ్డి పేద ప్రజలకోసం ఎంతోత్యాగం చేశాడని అతని ఆశయ సాధన కోసం మనంఅంతా కట్టుబడి ఉండాలని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పెంటయ్య ,చెన్నయ్య, సాయిలు దైవానందం మహేష్ నాగరాజు దిలీప్ కుమార్ సతీష్ కుమార్ బాలకృష్ణ లక్ష్మీనారాయణ చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

### కొనుగోలు కేంద్రాలను సద్వినియోగపరచుకోవాలి

**ఆమనగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీత నరసింహా**

**తలకొండపల్లి ,మే 20, ప్రభాతవార్త:** ప్రస్తుతం రైతులు పండించిన వరి ,మొక్కజొన్న పంటలను ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు అమ్మకాలు జరుపుకోవాలని ఆమనగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీత నరసింహ అన్నారు. బుధవారం నాడు తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జల్ గ్రామంలో నూతనంగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల మేలు కోసం మద్దతు ధర నిర్ణయించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందన్నారు. పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కొనుగోలు కేంద్రాన్ని చుట్టుపక్కల గ్రామాల రైతులు సద్వినియోపరుచుకోవాలన్నారు. వెల్జాల్ చుట్టుపక్కల గ్రామాలైన, మాదాయపల్లి, చౌదర్పల్లి, వెల్జాల్, వెంకటాపూర్ ,చెన్నంపల్లి, అంతారం, జూలపల్లి, గ్రామాల రైతులు ఈ కొనుగోలు కేంద్రం సద్వినియోపరుచుకుంటారని, రైతుల మేలు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తుందని అని చెప్పుకొచ్చారు. కొనుగోలు కేంద్రాల ద్వారా వరి ధాన్యానికి క్వింటాలకు 500 రూపాయల బోనస్ సైతం లభిస్తుందని రైతులందరూ సద్వినియోపరుచుకోవాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ యాదగిరి నరసింహ, సింగల్ విండో చైర్మన్ గట్ల కేశవరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అంజయ్య గుప్త వెంకటరెడ్డి శ్యామసుందర్ రెడ్డి సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి సిబ్బంది విజన్ ర గుప్త వెంకటరెడ్డి శ్యామ సుందర్ రెడ్డి సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి సిబ్బంది విజేందర్ రెడ్డి, ఆయా గ్రామాల రైతులు తదితరులు ఉన్నారు.

## వాహనదారులు ట్రాఫిక్ నియమాలను పాటించాలి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న దుద్యాల్ పోలీసులు

### దుద్యాల్ పోలీసులు

**దుద్యాల్, మే 20, ప్రభాతవార్త:** మండల పరిధిలోని హకీంపేట్ ప్రధాన కూడలిలో వాహనదారులకు ట్రాఫిక్ నియమాలపై దుద్యాల్ పోలీసులు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపే వ్యక్తులు సీట్ బెల్ట్ ధరించాలని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అతివేగంగా వాహనాలు నడపరాదని అన్నారు. ట్రాఫిక్ నియమాలను తప్పకుండా పాటించాలని అన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్స్ శ్రీశైలం, శంకర్, రవితేజ, హోంగార్డ్ రమేష్, వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

**BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR RANGA REDDY DISTRICT.**
**ABR.NO: RA 126 OF 2025.**

BETWEEN:
**M/s. Shriram Chits (India) Private Limited.,** Vikarabad Branch, Rep by it's Foreman / Senior Manager cum GPA Holder ...**DISPUTANT**

AND

1. **Mrs. Chakali Lavanya,** W/o. Ramulu, Aged about 44 Years, R/o. H.No:2-21, Nagasamundar Village, K.V. Ranga Reddy District, PIN:501106, Occ: Agriculture and Tailoring.
2. **Mr. Chakali Ramulu,** S/o. Chandrayya, Aged about 52 Years, R/o. H.No: 2-21,Nagasamu ndar Village, K.V. Ranga Reddy District, PIN:501106, Occ: Pinchayath Secretary, EMP Code: 1471903, O/o. Mandal Parishad Development Officer, Mandal Praja Parishad, Vikarabad District, Vikarabad, Telangana State.
3. **Mr. G. Dinesh Kumar,** S/o. Ramulu, Aged about 49 Years, R/o. H.No: 2-1-116, Sadhashivapet, Gollakerry, Medak District, PIN: 502291, Occ: Record Assistant, EMP Code:1443466, O/o. Gazette Head Mistress, ZPHS (Girls) Mominpet Mandal, Vikarabad District.
4. **Mr. Padamati Nagaraju,** S/o. Narsimulu, Aged about 49 Years, R/o. H.No: 2-79/1, Marpally Mandal, Bilkal, K.V. Ranga Reddy District, PIN: 501202.Occ: Extension Officer (PR & RD) Formerly E.O. (PR&RD, GR/L/E.O) EMP Code: 1443468, O/o. Mandal Praja Parishad, Bantwaram Mandal,Vikarabad District, PIN:501106, Telangana State.
5. **Mr. B. Kishan Reddy,** S/o. B. Anji Reddy, Aged About 39 Years, R/o. H.No: 4-54/1, Chippala Palli Mandal,Chippala Palli, Akkinepally, PIN: 508254, Occ: Panchayath Secretary, EMP Code: 1472389, O/o. Mandal Parishad Development Officer, Mandal Parishad Developement Officer, Nawabpet Mandal Vikarabad District, PIN:501111, Telangana State.

....**Opponents**

Please take notice that the above dispute is filed against you for recovery of **Rs. 2,36,659-00** (Two lakh thirty six thousand six hundred and fifty nine only) and the same is posted to **Date: 09-06-2026** for your appearance before the office of Deputy Registrar of Chits/Arbitrator R.R. DISTRICT (WEST) IInd Floor, Sony Complex, Narayana College Building, Prashanth Nagar, I.E., Kukatpally, Hyderabad. AT: RANGA REDDY (DIST), At 12-00 A.M. if you fail to attend the office of Deputy Registrar of Chits/Arbitrator, on that day the case will be heard and decided exparte.

(By ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR)

**M. Shiva Shekar.**
**M. Chandra Shekar.**
**ADVOCATES.**
H.NO: 11-3-664/191, Parsigutta, SECUNDERABAD.

